బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 18 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ శుక్రవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. షేక్‌పేట్‌లోని ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రంలో మొదటి సెట్‌ను కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంత రావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డిల సమక్షంలో రిటర్నింగ్ అధికారి పి. సాయిరాంకు అందజేశారు. అనంతరం రెండో సెట్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానాలతో కలిసి అధికారికి సమర్పించారు. అంతకుముందు ఎమ్మార్వో కార్యాలయానికి ఆయన భారీ ర్యాలీగా చేరుకున్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఐదోరోజు శుక్రవారం 20 మంది 23 నామినేషన్లు దాఖలు చేశారు.

# ప్రభుత్వ బడుల్లో పాలు, బ్రేక్‌ఫాస్ట్



- వచ్చే ఏడాది జూన్ నుంచి అమలు
- నర్సరీ నుంచి 4వ తరగతి వరకు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి
- ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2026 విద్యా సంవత్సరం జూన్ నుంచి అమలు జరిగే విధంగా ఈ కార్యాచరణ ప్రణాళిక ఉండాలని చెప్పారు.విద్యా శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు గారు, వేం నరేందర్ రెడ్డి గారు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. తొలి దశలో ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతంలో దృష్టి సారించాలని చెప్పారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూళ్లకన్నా మెరుగ్గా ఉండాలని, ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని చెప్పారు. ఇలాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని సూచించారు. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలకు తరలించాలని చెప్పారు.నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయాలని సూచించారు.

## చివరి క్వింటాల్ వరకు పత్తి కొనుగోలు

- రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



దేశంలోని పత్తి ఉత్పత్తిదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని, రాష్ట్రంలో 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతోందని తెలిపారు. ఈ పంటపై 22 లక్షలమంది రైతులు ఆధారపడి ఉన్నారని చెప్పారు.

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియలో పూర్తి సహకారం అందిస్తోందని వివరించారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపో వద్దని హెచ్చరిస్తూ, "కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు పత్తి కొనుగోలు చేస్తుంది" అని హామీ ఇచ్చారు.

**క్వింటాల్‌కు రూ.8,110 మద్దతు ధర**

పత్తి క్వింటాల్‌కు రూ.8,110 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో పత్తి ఉత్పత్తి దేశంలోనే అత్యధికంగా ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు సౌకర్యం పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మొత్తం 122 సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు.

**రైతులకు కిసాన్ యాప్ ద్వారా సౌకర్యం**

పత్తి సాగు, విక్రయ సౌకర్యం కోసం తొమ్మిది ప్రాంతీయ భాషల్లో లిలి'కిసాన్ యాప్'లిలిను అభివృద్ధి చేశామని, దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు స్లాట్ ఆధారంగా పత్తి విక్రయ అవకాశం కల్పిస్తామని చెప్పారు.

పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులు ఎంపికయ్యాయి. హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా పంట దిగుబడి రెట్టింపు అవుతుందని కిషన్ రెడ్డి వివరించారు. మహారాష్ట్రలోని అకోలా ప్రాంత రైతులు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు.

**నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు**


నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి హెచ్చరించారు.

"వచ్చే ఏడాది నుంచి మన రైతులు కూడా హై డెన్సిటీ ప్లాంటేషన్ చేసేలా పని చేస్తాం" అని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల్లో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

## ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు..?

- తెలంగాణ హైకోర్టు
- ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన పిటిషన్
- సమాధానం చెప్పేందుకు రెండు వారాలు సమయం కోరిన ప్రభుత్వం, కమిషన్
- విచారణ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్చించి స్పష్టత ఇవ్వాలని హైకోర్టు సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై మరో పిటిషన్ హైకోర్టులో దాఖలైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు రీ-నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు జరపాలని పిటిషనర్ కోరారు.

ఈ నెల 9న రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది సురేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు, "నిన్న సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు జరపమని చెప్పింది కదా?" అని వ్యాఖ్యానించింది. దీనికి ప్రతిగా ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది, "సుప్రీంకోర్టు ఓరల్‌గా మాత్రమే చెప్పింది కానీ ఆర్డర్‌లో ఎక్కడా లేదు" అని సమాధానం ఇచ్చారు.

**రెండు వారాల సమయం కోరిన ప్రభుత్వం, కమిషన్**

రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాది, బీసీ రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచుతూ నోటిఫికేషన్ ఇచ్చినందువల్లే దానిని సస్పెండ్ చేశామని కోర్టుకు తెలిపారు. కొత్త రిజర్వేషన్‌ల అంశంపై చర్చించి ఫ్రెష్ రీ-నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. దీంతో ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం రెండూ రెండు వారాల సమయం కోరాయి. హైకోర్టు ఆ అభ్యర్థనను సమ్మతించి తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## సింగరేణి కార్మికులకు దీపావళి గిఫ్ట్

- రూ.1.03 లక్షల బోనస్!
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు
- 18న చెల్లింపులు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దీపావళి పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించిన ప్రకారం, ఈ ఏడాది పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ కింద ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1.03 లక్షల బోనస్ చెల్లించనున్నారు.

ఉప ముఖ్యమంత్రి తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం రూ.400 కోట్ల రూపాయలు సింగరేణి బోనస్ చెల్లింపుల కోసం కేటాయించారు. రాష్ట్రంలోని 39,500 మంది కార్మికులకు దీని లాభం చేకూరనుంది. ఈ బోనస్ కేవలం కార్మికులకే వర్తిస్తుందని, అధికారులకు వర్తించదని స్పష్టం చేశారు.

ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి ఆదేశాల మేరకు శనివారం బోనస్ చెల్లింపులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. భూగర్భ గనుల్లో 190 మస్టర్లు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో, సర్ఫేస్ విభాగంలో 240 మస్టర్లు పూర్తి చేసిన ఉద్యోగులకు పూర్తి రూ.1.03 లక్షల బోనస్ లభిస్తుంది. తక్కువ మస్టర్లు పూర్తి చేసిన వారికి నిష్పత్తి ప్రకారం చెల్లింపులు ఉంటాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ఉద్యోగులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి తెలంగాణ రాష్ట్రానికి తలమానికమని, సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి చేయూత అందిస్తోందని అన్నారు. బోనస్ సొమ్మును కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేయాలని, లేక ప్రభుత్వ పొదుపు సంస్థల్లో సేవింగ్ చేయాలని ఉద్యోగులను సూచించారు.

## రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం




- కుల్సుంపురాలో కబ్జాలను తొలగించిన హైడ్రా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని ఆసిఫ్‌నగర్ మండలం, కుల్సుంపూర్‌లో సర్వే నంబరు 50లో ఆక్రమణలను శుక్రవారం హైడ్రా తొలగించింది. వ్యాపారి అశోక్ సింగ్ ఆక్రమణలో ఉన్న మొత్తం 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన అశోక్ సింగ్ ఆ భూమిలో షెడ్లు వేసి విగ్రహ తయారీదారులకు అద్దెకు ఇస్తున్నాడు. అయితే ఆ భూమి ప్రభుత్వానికి చెందినదని, దాన్ని కాపాడాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను హైదరాబాద్ కలెక్టర్ కోరారు. అంతేకాకుండా ప్రజావాణిలో సైతం స్థానికుల నుంచి ఫిర్యాదులందాయి. ఈ క్రమంలో హైడ్రా అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు.. హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆ భూమి తనదేనంటూ అశోక్ సింగ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇప్పటికే రెండు సార్లు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. అయినప్పటికి ఆ స్థలం ఖాళీ చేయకుండా తిరిగి షెడ్‌లను వేసిన అశోక్ సింగ్ అద్దెలను తీసుకుంటున్నాడు. ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడుతున్నాడు. అతనిపై వివిధ పోలీసు స్టేషన్లలో భూ కబ్జాదారుడుగా, రౌడీ షీటర్‌గా కేసులు నమోదయ్యాయి. లంగర్‌హౌస్, మంగళహాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో అశోక్ సింగ్‌పై 8కి పైగా కేసులు నమోదయ్యాయి. తాజాగా స్వాధీనం చేసుకున్న హైడ్రా ఆ స్థలంలో ఫెన్సింగ్ వేసింది. గజం స్థలం కూడా దొరకని కుల్సుంపురలో స్వాధీనం చేసుకున్న భూమిని ప్రజావసరాల కోసం వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలనే ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని సమాచారం.

# సుప్రీం తీర్పుపై 23న క్యాబినెట్‌లో నిర్ణయం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ తీసుకుంటే.. సీఎం నాయకత్వంలో అఖిలపక్షం ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ సర్వే నిర్వహించామన్నారు. సర్వే వివరాలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో స్థానిక ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు పెంచకుండా సీలింగ్ విధిస్తూ చట్టం తీసుకువచ్చిందని ఆరోపించారు. ఆ చట్టాన్ని తొలగిస్తూ ఆర్డినెన్స్ ఇచ్చామని, బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపామన్నారు. ఇలా అన్ని దశల్లో అవసరమైన చర్యలు చేపడితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం బీసీ చట్టం అమల్లోకి రాకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు. బీజేపీ నైజం రాష్ట్ర ప్రజలకే కాదు, దేశం మొత్తానికి తెలిసిందని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వచ్చి రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలుస్తామని పదేపదే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. బీసీలకు ఇచ్చిన హామీని తూచా తప్పక పాటించేందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టి అన్ని పార్టీలను ఆహ్వానించగా దేశంలోని ఇతర పార్టీలన్నీ మద్దతు తెలియజేయగా కేవలం బీజేపీ ఎందుకు అడ్డుపడుతుందని ప్రశ్నించారు. హైకోర్టు, సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసును గెలిచేందుకు దేశంలో అనుభవిజ్ఞులైన అభిషేక్ మను సింఘ్వి, రవి వర్మ వంటి న్యాయ కోవిదులను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించి కొట్లాడిన సంగతి దేశ ప్రజలందరికీ తెలుసని అన్నారు. శనివారం రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న బీసీ బంద్ నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర బీజేపీ విభాగం అధ్యక్షులు రామచంద్రరావు.. ప్రధాని మోడీ, రాష్ట్రపతి వద్ద బీసీ బిల్లు ఆమోదం కోసం సమయం తీసుకొని, రాష్ట్ర అఖిలపక్షానికి నాయకత్వం వహించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీ రాగానే బీసీల రిజర్వేషన్ల అంశంపై చర్చించి ఈనెల 23న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరావు, జావీద్, కొత్త సీతారాములు, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌ను ఎవరూ ఆపలేరు

- ఉగ్రదాడులపై ఇక మౌనం లేదు
- సర్జికల్, వైమానిక దాడులతో సమాధానం
- ప్రధాని మోదీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



భారత్ ఇక మౌనంగా ఉండే దేశం కాదని, ఉగ్రదాడుల తర్వాత ప్రతీకారం తీర్చుకునే సామర్థ్యం ఉన్న అన్‌స్టాపబుల్ నేషన్‌గా ఎదిగిందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రముఖ వార్తా సంస్థ నిర్వహించిన "సమ్మిట్-2025"లో ప్రసంగించిన ఆయన, "ఎన్ని అడ్డంకులు, స్పీడ్ బ్రేకర్లు ఉన్నా భారత్‌ను ఎవరూ ఆపలేరు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

"భారత్ ఇక ఉగ్రదాడుల తర్వాత మౌనంగా ఉండదు. వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యల ద్వారా ఉగ్రవాదులకు తగిన సమాధానం ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు ముదురుతున్న సమయంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. మనపై విమర్శలు చేసినవారిదే తప్పు అని నిరూపించాం" అని మోదీ చెప్పారు."140 కోట్ల మంది భారతీయులు పూర్తి వేగంతో ముందుకు సాగుతున్నారు. మేము ఆగము, నెమ్మదిగా వెళ్లము. భారత్ అన్‌స్టాపబుల్‌గా ముందుకు దూసుకుపోతుంది" అని ఆయన హామీ ఇచ్చారు.

ఈ ఏడాది ఏప్రిల్ 22న పాక్ ఉగ్రవాదులు జమ్మూ కశ్మీర్ పహల్గాంలో 26 మంది అమాయకులను చంపిన ఘటనను ప్రస్తావిస్తూ, "అప్పుడు భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, పీఓకేలోని ఉగ్రస్థావరాలను దెబ్బతీశాం. పాక్ దాడి చేసేందుకు ప్రయత్నించగా, భారత్ ప్రతిదాడితో చిత్తు చేసింది. ఇక మౌనం లేదు%ౌ% బదులు ఇస్తున్న భారత్ ఇదే" అని మోదీ వ్యాఖ్యానించారు. "ఒకప్పుడు ఐదు పేద దేశాల్లో ఒకటైన భారత్, నేడు ప్రపంచంలోని టాప్%-%5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. చిప్స్ నుంచి షిప్స్ వరకు భారత్ స్వావలంబన సాధించింది. ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది" అని మోదీ వివరించారు.

"కాంగ్రెస్ కాలంలో బ్యాంకుల జాతీయాకరణ వల్ల నిరర్థక ఆస్తులు పెరిగిపోయాయి. మేము తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ఆర్థిక, పారిశ్రామిక రంగాలు తిరిగి చైతన్యవంతమయ్యాయి. ప్రజాస్వామిక భాగస్వామ్యం ం అదే అన్‌స్టాపబుల్ ఇండియాకు ఇంధనం" అని ఆయన అన్నారు. డిజిటల్ మౌలిక వసతుల విషయంలో భారత్ సాధించిన పురోగతిని వివరించిన ప్రధాని, "ఒకప్పుడు అసాధ్యం అన్నారు%ౌ% కానీ భారత్ సాధించింది. ప్రపంచం ఇప్పుడు మన దేశాన్ని విశ్వసనీయ, బాధ్యతాయుత భాగస్వామిగా చూస్తోంది" అని చెప్పారు. "భారత్ ఇప్పుడు వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ. గత మూడు ఏళ్లలో 7.8% వృద్ధి సాధించాం. భారత్ ఇంత వేగంగా ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదు. ప్రపంచం ఇప్పుడు భారత్‌ను అవకాశాల గేట్‌వేగా చూస్తోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## 210 మావోయిస్టుల లొంగుబాటు



- సెంట్రల్ కమిటీ సభ్యుడితోపాటు 153 ఆయుధాల సమర్పణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగ్దల్‌పూర్‌లో పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోయారు. మొత్తం 210 మంది మావోయిస్టులు, అందులో ఒకరు సెంట్రల్ కమిటీ సభ్యుడు ఉన్నారు. వీరంతా పోలీసు, పారామిలిటరీ దళాల సమక్షంలో లొంగి సమాజంలో కలిసిపోయారు.

లొంగిన మావోయిస్టులు తమ వద్ద ఉన్న 153 ఆయుధాలను అధికారులకు అప్పగించారు. వీటిలో 19 ఏకే 47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్‌లు, 23 ఐఎన్ఎస్ఏఎస్ రైఫిళ్లు, ఒక ఎల్ఎంజీ (లైట్ మెషీన్ గన్), 36 పాత .303 రైఫిళ్లు, 4 కార్బైన్‌లు, 11 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు ఉన్నాయి.

లొంగిన వారిలో ఒకరు మావోయిస్టుల సెంట్రల్ కమిటీ సభ్యుడు, నలుగురు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నాయకులు, 21 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 61 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని పోలీసులు వెల్లడించారు.

లొంగిన మావోయిస్టులను స్థానిక ఆదివాసీ నాయకులు పూలమాలలతో స్వాగతించి, వారిని ప్రధాన సమాజంలోకి స్వాగతించారు. అనంతరం వారు పోలీసు, పారామిలిటరీ అధికారులు, ఆదివాసీ పెద్దలతో కలిసి ఫోటోలు దిగారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, "దేశంలో మావోయిస్టు ముప్పు ఇప్పుడు తుదిదశలో ఉంది. ఇది చరిత్రాత్మక రోజు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం" అని అన్నారు. గత రెండు రోజుల్లో మొత్తం 258 మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. అందులో గురువారం (అక్టోబర్ 16) 170 మంది ఛత్తీస్‌గఢ్‌లో, బుధవారం (అక్టోబర్ 15) 61 మంది మహారాష్ట్రలో లొంగారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిన 78 మావోయిస్టుల్లో 43 మంది మహిళలు ఉన్నారని అధికార వర్గాలు తెలిపాయి.

## ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

- 19న లైసెన్సులు ఇవ్వనున్న సీఎం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రైతాంగానికి మెరుగైన సేవలందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమీషనర్ రాజీవ్‌గాంధీ హనుమంత్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామపాలనాధికారులు (జీపీవో)ను అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4నుంచి 6మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ నెల 19న శిల్ప కళావేదికలో సీఎం చేతులమీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడాన్ని తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఆ విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరనీ, మరికొంత మంది అవసరమవుతారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, ఆ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ, అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ఏం సాధించారని విజయోత్సవాలు..?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. ఈ 23 నెలల పాలనలో ఏం సాధించారు అని విజయోత్సవాలు జరుపుతారు అని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమాలు నడుపుతారంటా.. ఎందుకు నాయన తుపాకులు పెట్టి వసూళ్లు బాగా చేసినందుకా? కమిషన్ల కోసం క్యాబినెట్‌లో గల్లాలు పట్టుకొని కొట్టుకున్నందుకా? మంత్రుల మధ్య తగాదాలు జరుగుతున్నందుకా? ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ఆరు గ్యారెంటీలు, 420 హామీలను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కింది. అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేసినందుకు విజయోత్సవాలు జరుపుతారా..? నెలకు రూ. 2500 ఇస్తారే మోనని మహిళలు ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయని వర్గం లేదు. రైతుబంధు ఇవ్వనందుకు, రుణమాఫీ చేయనందుకు ఉత్సవాలు జరుపుతారా..? గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా రాలుతున్నందుకు ఉత్సవాలు జరుపు తారా..? నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వనందుకు ఉత్సవాలు జరుపుతారా..? అని హరీశ్‌రావు నిలదీశారు.

# ధాన్యం సేకరణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మంత్రిమండలి సమావేశం..



**బలగం టీవీ, హైదరాబాద్**

వర్షాకాల సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 1 కోటి 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించనున్నట్టు అంచనా వేసిన నేపథ్యంలో, ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాల్లో రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకో వాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో దిగుబడి సాధించిన ధాన్యంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌర సరఫరాల విభాగం అంచనా. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది. మరో 15 లేదా 20 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీ చర్యలు తీసుకోవడమే కాకుండా, ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది.

రాష్ట్రంలో కొత్తగా మూడు (3) వ్యవసాయ కళాశాలలు, హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో ఏర్పాటుకు ఆమోదం. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన -ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించాలని, సంబంధిత ఏర్పాట్ల కోసం కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు పిల్లలకు మించి సంతానం కలిగిన వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనపై చర్చించిన మంత్రిమండలి, గరిష్ఠ నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం కావడంతో ఆ నిబంధనను ఎత్తివేసేందుకు అంగీకరించింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌కు 10 ఎకరాలు కేటాయించింది. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయిస్తూ తీర్మానం. ఈ యూనివర్సిటీ అడ్మిషన్లలో తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కోరింది.

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి మెట్రో 2ఏ, 2బీ విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్‌లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. అందుకు సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు. అధికారుల కమిటీ అందించే నివేదికను మంత్రివర్గ ఉప సంఘం సమగ్రంగా అధ్యయం చేస్తుంది.

రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ఆమోదం. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములకు ప్రత్యామ్నాయంగా ఆ శాఖకు 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ తీర్మానం.

కృష్ణా -వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకారం. మన్ననూర్ %-% శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని నిర్ణయం. మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, వాకిటి శ్రీహరి గారు మీడియా సమావేశంలో వివరించారు.

# బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి




- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బంద్‌కు అన్ని వర్గాల ప్రజల స్వచ్ఛందంగా సహకరించి, బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ సంఘాల పెద్దలు 42 శాతం రిజర్వేషన్ రాజకీయంగా ఇవ్వాలని శనివారం ఇచ్చిన తెలంగాణ బంధుకు జిల్లా కాంగ్రెస్ పక్షాన మద్దతు ఇస్తున్నామని అన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన మాట కోసం బీసీలకు 42 శాతం విద్యా ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ కృషి చేస్తున్నాదని అన్నారు.అసెంబ్లీలో బిల్లులను పాస్ చేసుకుని గవర్నర్, కేంద్రానికి పంపడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కృత నిశ్చయంతో ముందుకు పోతున్న తరుణంలో హై కోర్ట్ స్టే రావడం జరిగిందని అన్నారు.

ప్రజలను మేల్కొలిపే విధంగా బీసీ సంఘాలు ఇచ్చిన తెలంగాణ బంద్ కు కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడు సంఘీభావం తెలిపారని అన్నారు. కోర్టులో న్యాయపరంగా కొట్లాడుతమని, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుతున్నామని, న్యాయపరంగా చిక్కులు తొలగిపోతాయని మాకు పూర్తి ఆశాభావం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు బిసి బిల్లులు వెళితే, బిజెపి నాయకులు, 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు ఎందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడం లేదని ప్రశ్నించారు.

బీసీలకు నోటి కాడికి వచ్చిన బుక్కను లాక్కోవద్దని బిజెపి నాయకులను కోరుతున్నాని అన్నారు. కోర్టులో సవాలు చేసిన వారు జీఓ 9 జీవోను సవాల్ చేశారు కానీ చట్టాన్ని కాదని, బీసీ రిజర్వేషన్ల కోసం చిత్త శుద్ధి తో మేం ముందుకు పోతున్నామని, బిజెపి నాయకులు కూడా ఆలోచన చేయాలని అన్నారు.

# క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో కేసుల పరిష్కార శాతం పెంచాలి..

- గ్రామ స్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలి..
- ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలి
- ఎస్పీ మహేష్ బి. గితే



**బలగం టీవీ, వేములవాడ**

క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (దర్యాప్తు నాణ్యత) ద్వారా కేసుల పరిష్కార శాతాన్ని మరింతగా పెంచి, నిందితులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్ అధికారులను ఆదేశించారు. వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్ మొదటగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, నమోదైన కేసుల్లో నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించిన ప్రస్తుత కేసుల స్థితిగతులు, అలాగే స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష జరిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, సిబ్బంది పట్టణాలు, గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగిన త్వరగా ఉన్నతాధికారులకు చేరేలా గ్రామ స్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని అన్నారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో నగదు కోల్పోయిన బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.

అలాగే, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలి అన్నారు. నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రి రెడ్డి ఐపీఎస్, సి.ఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే రసమయి దిష్టి బొమ్మ దహనం

- బస్టాండ్ ఆవరణలో దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రియతమ నాయకులు డా. కవ్వంపల్లి సత్యానారాయణ పై ఆయన కుటుంబ సభ్యులపై మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ అభ్యంతరకరమైన, దురుసుగా మాట్లాడిన తీరును సభ్య సమాజం ఖండిస్తుందని. ఇలాంటి మాటలు ఇంకోసారి గనుక మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణకి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ రాజేశం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కరుణాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జమల్, ఎస్ సి సెల్ జిల్లా నాయకులు జుట్టు నగేష్, ఫిషరీస్ చైర్మన్ జెట్టి మల్లేష్, సాయి వర్మ, మల్లయ్య, బడుగు లింగం,బంగారి ఆంజినేయులు,లక్ష్మన్, రవి, దయసాగర్, బాబు, చిక్కుడు సత్యం, రమేష్, శ్రీకాంత్, నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కేడీసీసీ బ్యాంక్ లో సౌభాగ్య పథకానికి అధిక వడ్డీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఇంటింటా కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మేనేజర్ సిబ్బందితో కలిసి కరపత్రాలతో సౌభాగ్య పిక్స్ డ్ డిపాజిట్ పథకంపై ప్రచారం నిర్వహించారు.ఇతర బ్యాంకుల కంటే కేడీసీసీ బ్యాంక్ 333 రోజుల కాలపరిమితికి సౌభాగ్య పథకంలో సాదారణ ప్రజలకు సుమారు 8 శాతం, సీనియర్ సిటిజన్స్, మహిళలకు సుమారు 8.5 శాతం వడ్డీ అందజేస్తుందని మేనేజర్ నవాబ్ తెలిపారు. వివరాలకు తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్ కార్యాలయాన్ని సంప్రదించాలని మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ మౌనిక, స్టాఫ్ అసిస్టెంట్ అజంత, ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, ఆఫీస్ బాయ్ శ్రీకాంత్, సీఈవో అజయ్ కుమార్, అంజి, రాజయ్య, సాయి, వెంకటేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ రాష్ట్ర బంద్

- బీసీ జేఏసీ పక్షాన పర్ష హన్మాండ్లు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ప్రభుత్వ జీవోపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ, అక్టోబర్ 18, 2025 శనివారం నాడు బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ పక్షాన పర్ష హన్మాండ్లు ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ,హెూటల్స్, బ్యాంక్స్, వైన్స్ షాపులు, రెస్టారెంట్లు, ఎలక్ట్రికల్ షాప్స్, బట్టల షాప్స్, మాల్స్, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు అన్ని విద్యాసంస్థలు, కిరాణా షాపులు, సినిమా టాకీస్ లు, మరియు మిగతా అన్ని వర్తక, వ్యాపార సంస్థలు మూసివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీసీల న్యాయమైన హక్కుల పరిరక్షణ పోరాటానికి జిల్లా ప్రజలందరూ స్వచ్ఛందంగా మద్దతు తెలిపి, బంద్‌ను విజయవంతం చేయాలని పర్ష హన్మాండ్లు కోరారు.


# గల్ఫ్ ఎడారిలో గొర్రెల కాపరి గోస..

- ఓమాన్ లో చిక్కుకున్న నాన్నను రక్షించడని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించిన కూతురు..
- మెడికల్ లో 'క్లీనర్', వీజాలో 'అగ్రికల్చరల్ వర్కర్'



**బలగం టీవీ, హైదరాబాద్**

ఎన్నో ఆశలతో 2025 ఆగస్ట్ 20 నాడు హైదరాబాద్ టు మస్కట్ విమానం ఎక్కిన నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం సిద్దపల్లి – బెజ్జోర గ్రామానికి చెందిన బోజ సురేష్ ఓమాన్ దేశంలో గొర్రెల కాపరిగా గోస పడుతున్నాడు. 'క్లీనర్' పని అని చెప్పి మెడికల్ చేయించిన ఏజెంట్, 'అగ్రికల్చరల్ వర్కర్' అనే వీసాతో ఓమాన్ పంపించారు. నెలకు 120 రియాళ్ళ జీతం, ఉచిత భోజనం అని ఏజెంట్ చెప్పాడని, వాస్తవం ఇందుకు భిన్నంగా ఉందని ఆయన వాపోతున్నారు.




ఓమాన్ రాజధాని మస్కట్ కు 250 కి.మీ. దూరంలోని 'యాంకుల్' అనే పట్టణం సమీపంలోని ఒక గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో బోజ సురేష్ గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. రెండు గంటలకు ఒకసారు గడ్డి కోయడం, విపరీతమైన పని ఒత్తిడి, ఎడారి వాతావరణం తట్టుకోలేక పోతున్నానని సురేష్ వాపోయాడు. ఇటీవల తన తల్లి చనిపోయిందని, భార్య అనారోగ్యంతో ఉందని, తనను ఎలాగైనా ఇండియాకు వాపస్ పంపాలని కోరుతున్నాడు. సహాయం కోసం, సురేష్ కూతురు తేజశ్రీ శుక్రవారం (17.10.2025) హైదరాబాద్ లోని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి పేరిట ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.90 వేలు తీసుకుని ఒకపని అని చెప్పి, మరొక పనిపై పంపిన ఎజెంట్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తన తండ్రి బోజ సురేష్ ను ఓమాన్ ఎడారి నుంచి రక్షించి స్వదేశానికి తీసుకరావాలని ఆమె కోరారు. ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రధాన కార్యదర్శి బిఎల్ సురేంద్రనాథ్, ప్రజావాణి సిబ్బంది జగదీశ్ పటేల్, 'టాంకాం' ప్రతినిధి పవన్ ఆమెకు మార్గదర్శనం చేసి, భరోసా ఇచ్చారు.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీది కపట నాటకం..

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని అవలంభిస్తోందని, రాష్ట్రంలో మద్దతు ఇస్తూ కేంద్రంలో బీసీ బిల్లును అడ్డుకుంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ బీసీ సంఘాలు అక్టోబర్ 18న తలపెట్టిన రాష్ట్ర బందుకు సంబంధించిన కార్యాచరణపై సిరిసిల్లలోని అమృత్యాలు శుక్లా కార్మిక భవనంలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ.. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ అక్టోబర్ 18న రాష్ట్ర బందుకు పిలుపునిచ్చిందని రమేష్ తెలిపారు. ఈ బందులో బీసీ సంఘాలు బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తేనే సీపీఎం మద్దతుగా పాల్గొంటుందని స్పష్టం చేశారు. లేదంటే, సీపీఎం స్వతంత్రంగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తుందని, బందులో కూడా స్వతంత్రంగా పాల్గొంటుందని ఆయన ప్రకటించారు.

"బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కపట నాటకం ఆడుతోంది. రాష్ట్రంలో మద్దతు ఇస్తూ, కేంద్రంలో బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా అడ్డుకుంటోంది," అని ము. శం. రమేష్ మండిపడ్డారు. హిందూ మతం పేరు చెప్పుకొని బీసీల ఓట్లు దండుకుంటూ, అగ్ర కులాలవారు అధికారం చెలాయిస్తూ బీసీలను రాజ్యాధికారం నుండి దూరం ఉంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. అగ్రకులాల పార్టీ అయిన బీజేపీ కావాలనే బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటోందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేంతవరకు సీపీఎం పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ బండి సంజయ్‌ను నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా బీసీ ప్రజలందరూ నిలదీయాలని రమేష్ పిలుపునిచ్చారు. "మందిర్ మసీదుల గురించి మాట్లాడి మత విద్వేషాలు రెచ్చగొట్టే బండి సంజయ్, బీసీవై ఉండి కూడా పార్లమెంటులో బీసీ బిల్లు గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటు," అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అనుసరిస్తున్న ద్రోహపూరిత విధానాలకు వ్యతిరేకంగా జిల్లాలోని బీసీ ప్రజలందరూ అక్టోబర్ 18న జరిగే రాష్ట్ర వ్యాప్త బందులో పాల్గొని, విజయవంతం చేయాలని ముశం రమేష్ కోరారు. ఈ సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ పాల్గొన్నారు.

# హర్యానా డీజీపీపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్

**బలగం టీవీ, వేములవాడ**



హర్యానా క్యాడర్‌లో సేవలందిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పురన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన హర్యానా డీజీపీపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సేన ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని బహుజన సేన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ "పురన్ కుమార్ తన సుదీర్ఘ సేవల ద్వారా హర్యానాలో ప్రశంసలు పొందిన అధికారి. పురాన్ కుమార్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అతనిపై కుల అహంకారంతో హర్యానా డీజీపీ కక్ష సాధిస్తూ మానసికంగా హింసించాడు. ఇలాంటి పరిస్థితులలో పురన్ కుమార్ తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితికి చేరారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే భారత దేశంలో కుల వ్యవస్థ వలన దళిత సామాజిక వర్గం ఎంత ఉన్నతమైన స్థానంలో ఉన్నప్పటికీ వివక్షతను ఎదుర్కోవాల్సి ఉంటదని ఎంతో ఆవేదన చెంది ఎన్నో పోరాటాలు చేసి భారత రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించినప్పటికీ, నేటికీ ఇలాంటి కుల వివక్షతో హత్యలు మరియు ఆత్మహత్యలు జరగడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు.

# ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస అన్నారు. శుక్రవారం శృంగేరి జగదురులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి ధర్మ విజయ యాత్రలో భాగంగా ఈ నెల 19&20 తేదీలలో వేములవాడకు విచ్చేయు చున్న సందర్భంగా స్వామివారికి ఘనంగా స్వాగతం పలకడానికి తగిన ఏర్పాట్లపై వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన ఆవరణలోని ఓపెన్ స్లాబ్ లో సమావేశం నిర్వహించక ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా లోక కళ్యాణార్థం అన్ని వర్గాలను, అన్ని పక్షాలను కలుపుకొని వెళ్ళాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.

శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర శర్మ జగద్గుర్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని,నా భూతో నా భవిష్యత్తు అనేలా స్వాగతం పలకాలని అన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా స్వాగత ఏర్పాట్లు ఉండాలని,ఆకాశమే హద్దుగా ఎవరికి నచ్చిన రీతిలో ఆధ్యాత్మిక చింతనతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. వేములవాడ పట్టణంతోపాటు పరిసర మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 19, 20వ తేదీల్లో జగద్గుర్ రాక కొరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి కృషితో 150కోట్లతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని,100ఏళ్లకు సరిపడేలా ఏర్పాట్లు చేసేందుకు ఆలయ నిర్మాణం ఉంటుందని అన్నారు. బ్రాహ్మణోత్స మూల కోరిక మేరకు శంకర మఠంలో స్వామివారి అభిషేక కార్యక్రమం ఉంటుందని, ఈ క్రమంలో శృంగేరి వేములవాడ రాక, వారి సూచనలు ఎంతో విలువైనవి అని అన్నారు. పీఠాధిపతికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు అందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. 19వ తేదీన సాయంత్రం 6 గంటల లోపు వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్దకు అందరూ చేరుకొని నా భూతో నా భవిష్యత్తు అనే రీతిలో స్వామివారికి స్వాగతం పలకాలని అన్నారు.

# భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు..



**బలగం టీవీ, వేములవాడ**

భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని, తిప్పాపూర్ గోశాల లో రైతులకు ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాల లో రైతులకు ఉచిత కోడెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై రైతులకు కోడెలను పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రాజన్న ఆలయాలలో స్వామి వారికి కోడెను కట్టే, సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, రైతులకు పంపిణీ చేసిన కోడెలను అప్పుడు అప్పుడు చెక్ చేస్తున్నామని అన్నారు. కోడెలను ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల్లో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణం చేయడం జరుగుతుందని, 40 ఎకరాల విస్తీర్ణంలో అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించే వారు పాలు మరిచిన తర్వాత కోడెలను అందజేయాలని అన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు వీపీఓ వ్యవస్థ కలిగి ఉండాలి..
- పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి..
- సిరిసిల్ల సబ్ డివిజన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. సిరిసిల్ల సబ్ డివిజన్ అధికా రులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ.. నేర విచారణ మరింత సమర్ధవంతంగా చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటిని సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా పని చేయాలని ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు.

దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల పై నిఘా ఉంచాలని వారి పై కేస్ లు నమోదు చేయాలని అన్నారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. స్టేషన్ల పరిధిలోని రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు.అక్రమ కార్యకలాపాలు అయిన గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట,గుడుంబా, పీడీఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు.ప్రజల నుండి వచ్చే సమస్యలను తెలుసుకుని ఏ రకంగా పరిష్కరించాలనే విషయంలో గ్రామ పోలీస్ అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, న్యాయం వైపు పని చేస్తూ బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయడం ద్వారా ప్రజలలో పోలీస్ శాఖ పట్ల మరింత నమ్మకం, గౌరవం పెంపొందించేలా పని చేయాలన్నారు. వీపీఓలు ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడిచేటట్లు వారికి అవగాహన కల్పిచాలన్నారు.. ఈ సమావేశంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు మొగిలి, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జటాధర ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ యాక్షన్ హీరో సుధీర్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని వెంకట్ కళ్యాణ్ అండ్ అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. కథను వెంకట్ కళ్యాణ్ స్వయంగా అందించారు. తెలుగు, హిందీ భాషల్లో సమాంతరంగా తెరకెక్కుతున్న ఈ బైలింగ్యువల్ ప్రాజెక్ట్ ద్వారా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లో అడుగు పెడుతున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రాన్ని నవంబర్ 7న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. మైథాలజికల్, సూపర్‌న్యాచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో సోనాక్షి సిన్హా శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నట్లు ట్రైలర్‌లో స్పష్టమవుతోంది. రైన్ అంజలి, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్




కె.ఆర్. భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# దక్షిణాఫ్రికాకు హ్యాట్రిక్ విజయం




బలగం టీవీ, హైదరాబాద్

తొలి ఐసీసీ ట్రోఫీ వేటలో దక్షిణాఫ్రికా జట్టు దూకుడు కొనసాగిస్తోంది. వన్డే వరల్డ్ కప్‌లో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసిన సఫారీ మహిళల జట్టు, స్వగృహంలో పోరాడిన శ్రీలంకను చిత్తు చేసింది. వర్షం అంతరాయంతో డక్‌వర్త్–లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన 121 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా 10 వికెట్ల తేడాతో ఛేదించింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (60 నాటౌట్) ఆగ్రహ ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చగా, ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్ (55 నాటౌట్) అద్భుతంగా సహకరించింది.

ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సఫారీ బౌలర్లు అద్భుత ప్రదర్శన చూపారు. శ్రీలంక బ్యాటర్లు వర్షం అంతరాయంతో కుదించిన 20 ఓవర్లలో 7 వికెట్లకు 105 పరుగులు మాత్రమే చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్ మ్లాబా చివరి ఓవర్‌లో మూడు కీలక వికెట్లు తీసి లంకను మరింత కష్టాల్లోకి నెట్టింది.

### శ్రీలంకపై 10 వికెట్ల తేడాతో గెలుపు

చిన్న టార్గెట్‌ను ఛేదించడంలో దక్షిణాఫ్రికా ప్రారంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. లారా %–% బ్రిట్స్ జంట బౌండరీలతో చెలరేగి 46 బంతుల్లో అర్ధశతక భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. ఆపై వరుస ఫోర్లు, సిక్సర్లతో మ్యాచ్‌ను దాదాపు ఒక్కదశలోనే ముగించారు. లారాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

వర్షం కారణంగా ఐదు గంటల ఆలస్యంతో ప్రారంభమైన మ్యాచ్‌లో శ్రీలంక మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కొంత ప్రతిఘటన చూపారు. విష్మీ గుణరత్నే (34), నీలాక్షి డిసిల్వా (18) ఆరో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం అందించారు. అయితే చివరి ఓవర్లలో వికెట్లు పతనమవడంతో జట్టు 105కే పరిమితమైంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా నాలుగు విజయాలు సాధించి సెమీస్‌కు చేరువైంది. మరోవైపు ఐదు మ్యాచుల్లో మూడు ఓటములు, రెండు రద్దుల కారణంగా శ్రీలంక దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# బంద్ ఫర్ జస్టిస్ నినాదంతో అన్ని వర్గాలు స్వచ్ఛందంగా పాల్గొనండి..

### జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల పర్శరాం పిలుపు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల



రాష్ట్ర హైకోర్టు బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, జాతీయ బీసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రేపు శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న బందును విజయవంతం చేయాలని సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మేకల పర్శరాం పిలుపునిచ్చారు. వేములవాడ అర్బన్ మండలం, నాంపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "బంద్ ఫర్ జస్టిస్" అనే నినాదంతో ఈ బంద్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని, బీసీల హక్కుల పరిరక్షణ పోరాటానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ?ఈ బీసీ సంఘాల బంద్‌కు జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు వివిధ పార్టీలు మద్దతు ప్రకటించడాన్ని పర్శరాం స్వాగతించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ బంద్‌లో బీసీ సంఘాల నాయకులు చురుగ్గా పాల్గొని, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపేలా కృషి చేయాలని ఆయన కోరారు. ?బీసీల న్యాయమైన హక్కులను కాపాడడంలో హైకోర్టు స్టే బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ప్రజలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించేంతవరకు తమ నిరసనలు, పోరాటాలు ఇదేవిధంగా కొనసాగుతూ ఉంటాయని మేకల పర్శరాం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం ఈ బంద్ ఒక బలమైన ప్రారంభంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులతోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ గవాయి మీద దాడిని ఖండిస్తున్నాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి ప్రభాకర్

బలగం టీవీ, వేములవాడ



జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాలతో భారత సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి బిఆర్ గవాయి మీద దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి ప్రభాకర్.. భారత సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి బిఆర్ గవాయి మీద దాడిని ఖండిస్తూ, శుక్రవారం రోజున ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ ఆధ్వర్యంలో వేములవాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం మండల తహసీల్దార్ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి ప్రభాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుడిష మనోజ్ కుమార్ మాదిగ, సామర్ల ప్రతాప్ మాదిగ, గుడిసె అరుణ్ కుమార్ మాదిగ, మేకల శంకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ గ్రౌండ్‌లోకి రోహిత్-కోహ్లీ

### ఏడు నెలల విరామం తర్వాత వన్డేలకు సిద్ధమైన స్టార్ బ్యాట్స్‌మన్‌లు

బలగం టీవీ, హైదరాబాద్




టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్‌లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ యాక్షన్‌లోకి దిగుతున్నారు. ఈ ఇద్దరు దిగ్గజులు అంతర్జాతీయ క్రికెట్ ఆడి ఏడు నెలలు, ఐపీఎల్ ఆడి అయిదు నెలలు గడిచింది. ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరగనున్న తొలి వన్డే కోసం ఇద్దరూ పెర్త్‌లో నెట్స్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. బీసీసీఐ తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో రోహిత్, కోహ్లీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలను షేర్ చేస్తూ, "Back in Blues" అని క్యాప్షన్ ఇచ్చింది.

కోహ్లీ సుమారు 40 నిమిషాలపాటు నెట్స్‌లో గడిపాడు. రాణా, అర్షదీప్‌తో పాటు లోకల్ బౌలర్ల బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. రోహిత్ శర్మ కూడా నెట్స్‌లో తీవ్రంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. కోహ్లీ షాట్లు కొట్టినప్పుడు బంతి సౌండ్ మారుమోగగా, రోహిత్ టైమింగ్ కోసం కొంత శ్రమించినట్లు కనిపించింది. అయితే కొంత సమయం తర్వాత భారీ షాట్లు కొడుతూ రిథమ్‌ను అందుకున్నాడు. ఆదివారం (అక్టోబర్ 19) పెర్త్ వేదికగా భారత్–ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లో రోహిత్–కోహ్లీ జంట ప్రదర్శనపై అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కోహ్లీ, రోహిత్ ఇద్దరూ కలిపి ఇప్పటివరకు సుమారు 600 వన్డేలు ఆడారు. ఈ సిరీస్‌తో వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు ఇది వారి ఫేర్‌వెల్ సిరీస్ కావచ్చని అంటున్నారు.

# భారత క్రికెట్ సంఘం అధ్యక్షురాలిగా శాంతా రంగస్వామి


బలగం టీవీ, హైదరాబాద్



భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి మరో కీలక బాధ్యతను స్వీకరించారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఆమెను భారత క్రికెట్ సంఘం అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఢిల్లీ మాజీ ఓపెనర్ వెంకట్ సుందరం కార్యదర్శిగా, దీపక్ జైన్ కోశాధికారిగా ఎంపికయ్యారు. అలాగే జ్యోతి థాటే, సంతోష్ సుబ్రమణియన్‌లు ఐసీఏ ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఐసీఏ ప్రతినిధిగా మాజీ కెప్టెన్ సుధా షా, ఐపీఎల్ పాలక మండలిలో ప్రతినిధిగా శుభాంగి కులకర్ణిలకు బాధ్యతలు అప్పగించారు. పురుషుల విభాగం నుంచి బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా వి. చాముండేశ్వరనాథ్ ఎంపికయ్యారు. చెన్నైలో జన్మించిన శాంతా రంగస్వామి, భారత మహిళల క్రికెట్ చరిత్రలో సుస్థిర ముద్ర వేసిన లెజెండ్‌గా నిలిచారు. భారత మహిళల జట్టుకు మొదటి కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె, దేశానికి తొలి టెస్ట్ విజయాన్ని వెస్టిండీస్‌పై అందించారు. ఆల్‌రౌండర్‌గా 1976 నుంచి 1991 మధ్యకాలంలో భారత తరఫున ప్రాతినిధ్యం వహించిన శాంతా రంగస్వామి, మహిళల క్రికెట్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

# 'బాహుబలి: ది ఎపిక్' సెన్సార్ పూర్తి

బలగం టీవీ, హైదరాబాద్




భారతీయ సినిమా చరిత్రలో సంచలనం సృష్టించిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసారి సరికొత్త రూపంలో, ఒకే చిత్రంగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో విడుదలకు సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా విడుదలైన ఈ చిత్రాన్ని ఇప్పుడు ఒకే వెర్షన్‌గా మలచి, కొత్తగా ఎడిట్ చేశారు. తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తవగా, ఈ సినిమాకు U/A సర్టిఫికెట్ లభించింది. చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, 'బాహుబలి: ది ఎపిక్' మొత్తం నిడివి 3 గంటల 44 నిమిషాలు. దీని ఇటీవలి కాలంలో అత్యధిక రన్‌టైమ్ కలిగిన భారతీయ చిత్రాల్లో ఈ సినిమా కూడా ఒకటిగా నిలిచింది.

వాస్తవానికి 'బాహుబలి' రెండు భాగాల కలిపిన నిడివి 5 గంటల 27 నిమిషాలు. కొత్త వెర్షన్‌లో దాదాపు గంటన్నరకు పైగా తగ్గించి, ప్రత్యేక ఎడిటింగ్ చేశారు. పాత సన్నివేశాల్లో కొన్నింటిని తొలగించి, అప్పట్లో విడుదల కాని కొత్త సీన్లు చేర్చినట్లు సమాచారం. అయితే ఏ సన్నివేశాలు తొలగించబడ్డాయి, ఏవి కొత్తగా చేర్చబడ్డాయో అనే విషయంలో మేకర్స్ సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై పదేళ్లు పూర్తైన సందర్భంగా, ఈ ప్రత్యేక వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 31న భారత్‌లో, రెండు రోజుల ముందే అక్టోబర్ 29న అమెరికాలో ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ..

బలగం టీవీ, వేములవాడ



వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త బూర ప్రభాకర్ తల్లి బూర భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ స్వయంప్రభ, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, సీనియర్ నాయకులు బూర బాబు, మ్యాకల రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తయ్య, ముడికే కొండస్వామి , రుద్రవేని రవికుమార్ బూర ప్రదీప్, గొనేల శ్రీనివాస్, గొనెల రాజు, బూర సుమన్, బూర రాజు, బూర సుల్తాన్, సుంకరి పోచయ్య, బొల్గం సత్తయ్య, మైలారం తిరుపతి, ముడికె అంజి తదితరులు ఉన్నారు.